నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 21 ఏప్రిల్ 2024 | MAHABUBNAGAR NARAYANPET



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, వేదికపై లక్ష్మారెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి

# కేసీఆర్ పర్యటనను సక్సెస్ చేయాలి

- రైతులు, ప్రజల కష్టాలు తెలుసుకోనున్న గులాబీ బాస్
- కాంగ్రెస్ అసమర్థ పాలనను ప్రజల్లో ఎండగట్టాలి
- బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఎంపీలుగా గెలిపించాలి : శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 20 : బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం పార్టీ అధినేత పర్యటనపై మహబూబ్‌నగర్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లా పరిధిలో రైతులు, ప్రజలతో మాట్లాడడంతోపాటు రోడ్ షోలలో కేసీఆర్ పాల్గొంటారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో నమ్మకం కోల్పోయిందని, అసెంబ్లీ ఎన్నికల్లో అమలుకు సాధ్యం కాని హామీలు ఇవ్వడంతోపాటు తప్పుడు ప్రచారంతో ఎన్నికల్లో గెలిచారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పింఛన్లు ఇవ్వలేక, రైతుబంధుకు రాంరాం చెప్పడం,రుణమాఫీ చేయలేదని దుయ్యబట్టారు. ప్రజలంతా హస్తం పార్టీ పాలనపై విసిగిపోయారని, మరోసారి గులాబీ పార్టీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాబోయే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మారిన వారి గురించి ఆలోచించవద్దని, కష్టాల్లో పార్టీ కోసం నిలబడిన వారికి భవిష్యత్తులో పదవులు దక్కుతాయని చెప్పారు. కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని, బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు.

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తన చేతగాని తనాన్ని ఎంతోకాలం దాచలేకపోయిందన్నారు. ప్రజలకు మూడు నెలల్లోనే వారి పాలన అర్థమైందని, బీఆర్‌ఎస్‌ను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి నేడు పంటలు ఎండిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు.

కాంగ్రెస్ అసమర్థ పాలనపై ప్రజలకు వివరించి బీఆర్‌ఎస్ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు శివరాజ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రెహమాన్, నాయకుడు గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి, వేదికపై జైపాల్‌యాదవ్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

# పనితీరును బేరీజు వేసుకోండి

- పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం
- మీడియా సమావేశం పెట్టని మోదీ
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- మీ బిడ్డగా ఆశీర్వదించండి : ఆర్‌ఎస్‌పీ

ఆమనగల్లు, ఏప్రిల్ 20 : కేసీఆర్ ప్రభుత్వ పనితీరును, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును బేరీజు వేసుకోవాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్‌పీతో కలిసి నిరంజన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రాంతీయ పార్టీల పాలనలో తెలంగాణ, ఏపీ, పంజాబ్, హర్యానా, తమిళనాడుతోపాటు పలు రాష్ట్రాలు అభివృద్ధి చెందాయన్నారు. అదే జాతీయ పార్టీల పాలనలో ఉన్న ఉత్తరప్రదేశ్, బీహార్, గుజరాత్ వంటి రాష్ట్రాలు ఎందుకు వెనుకబడి పోయాయని ప్రశ్నించారు. గతంలోని పీఎంలు మీడియా సమావేశంలో దేశానికి చేసిన అభివృద్ధి, ఇతర అంశాలను తెలియజేసేవారని, కానీ మోదీ వచ్చి పదేండ్లు అయినా జాతీయ మీడియాను తన గుప్పిట్లో పెట్టుకొని ఒక్క సమావేశం కూడా ఏర్పాటు చేయలేదని ధ్వజమెత్తారు. ఇక కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా గ్యారెంటీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఈ రెండు పార్టీలను నమ్ముకొంటే నట్టేట ముంచుతాయని హెచ్చరించారు. అందుకే ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం ఆర్‌ఎస్‌పీ మాట్లాడుతూ మీ ప్రాంత బిడ్డగా ఎన్నికల బరిలో నిలిచానని, తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. గురుకుల పాఠశాలల కార్యదర్శిగా ఎందరో పేద విద్యార్థుల భవితకు బాటలు వేశానని చెప్పుకొచ్చారు. తాను గెలిస్తే ఈ ప్రాంత సమస్యలను పార్లమెంట్‌లో వినిపిస్తానని చెప్పారు. తాను కాంగ్రెస్‌లో చేరితే టీఎస్‌పీఎస్సీ పదవి ఇస్తానని సీఎం రేవంత్ ఆశ చూపారని, తాను ప్యాకేజీలకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదన్నారు. తెలంగాణ బిడ్డల ఆత్మ బలిదానాలు చూసి బీఆర్‌ఎస్‌లో చేరినట్లు తెలిపారు. సమావేశంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి చాడ కిషన్‌రెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి రంగినేని అభిలాష్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న సివిల్ సప్లయి టాస్క్‌ఫోర్స్ అధికారులు

# రూ.23కోట్ల ధాన్యం మాయం

- రైస్‌మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు
- 2,86,694 ధాన్యం బస్తాలు తక్కువగా గుర్తింపు

కల్వకుర్తి, ఏప్రిల్ 20 : కల్వకుర్తి పట్టణంలోని లక్ష్మీవెంకటనర్సింహ స్వామి పారా బాయిల్డ్ రైస్‌మిల్లులో శనివారం హైదరాబాద్ సివిల్ సప్లయ్ అధికారుల బృందం ఆకస్మిక దాడులు నిర్వహించింది. మిల్లులో వడ్ల బస్తాలను లెక్కించారు. సీఎంఆర్‌కు సంబంధించిన 2,86,694 వడ్ల బస్తాలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.23.3కోట్లుగా అధికారులు చెప్పారు. బియ్యంగా మార్చి ఇవ్వమని ప్రభుత్వం ఇచ్చిన వడ్లను చాలా మంది రైస్ మిల్లుల వ్యాపారులు వడ్లను చీకటి మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. టార్గెట్ ప్రకారం రైస్ మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని సివిల్ సప్లై శాఖకు అప్పగించకుండా కాలాయాపన చేస్తుండటంతో వడ్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించారనే ఆరోపణలకు బలం చేకూరినట్లయ్యింది. దీంతో సివిల్ సప్లయ్ టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం అనుమానం వచ్చిన మిల్లులలో తనిఖీలు నిర్వహిస్తున్నది. ఈ క్రమంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు లక్ష్మీ వెంకట నర్సింహ రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించారు. మిల్లులో సీఎంఆర్ వడ్ల బస్తాలు మాయమయ్యాయని నిర్ధారించిన అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు.

***రైస్‌మిల్లు యజమాని రిమాండ్***

పాన్‌గల్, ఏప్రిల్ 20 : మండలంలోని మాందాపూర్‌కు చెందిన పుచ్చుల పరమేశ్వర్‌రెడ్డికి అతడి కుటుంబ సభ్యుల పేరిట వనపర్తి జిల్లాలో నాలుగు రైస్‌మిల్లులు ఉన్నాయి. మాందాపూర్‌లో కోడలు అనూషరెడ్డి ఇషాన్ అగ్రోటెక్ మిల్లులో సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌తో కస్టమ్స్ మిల్లింగ్ రైస్ గురించి ఒప్పందం చేసుకొని బియ్యాన్ని తిరిగి వారికి ఇవ్వకుండా సివిల్ సప్లయ్ కార్పొరేషన్ వారిని, ప్రభుత్వాన్ని మోసం చేసి బహిరంగ మార్కెట్‌లో రూ.3కోట్ల 25లక్షలకు అమ్ముకొన్నారు. ఈ విషయంలో శనివారం పుచ్చుల పరమేశ్వర్‌రెడ్డిని అరెస్ట్ చేసి కోర్టులో ఎదుట హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వేణు తెలిపారు.

కాగా, పుచ్చుల మధుకుమార్‌రెడ్డి, అనూషరెడ్డి పరారీలో ఉన్నారని తెలిపారు.

# జాతీయ పార్టీలను నమ్మితే మోసపోతాం..

- ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

జాతీయ పార్టీల మోసపూరిత మాటలు నమ్మితే తెలంగాణ ప్రజల బతుకులు ఆగమవుతాయని, ఆలోచించి ఓటు వేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి కోరారు. పదేండ్ల కేసీఆర్ పాలనకు, నాలుగు నెలల కాంగ్రెస్ పాలనకు తేడాను ప్రజలు గమనించారన్నారు. పదేండ్లు సస్యశ్యామలంగా ఉన్న తెలంగాణను కాంగ్రెస్ రాగానే కరువు కాటకాలతో అల్లాడే స్థితికి తెచ్చిందన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా కేసీఆర్ పేదలకు అండగా నిలిచి రాష్ట్రాన్ని కంటికి రెప్పలా కాపాడుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ చెప్పిన రూ.2లక్షల రుణమాఫీ, రైతుబంధు, తులం బంగారం, దళితులకు రూ.12లక్షలు, వరికి రూ.500ల బోనస్ ఇవన్నీ బోగస్‌గా నిలిచాయన్నారు. గ్రామాల్లో కనీసం తాగునీరు లేక ప్రజలు రోడ్లపైకి రావాల్సిన దుస్థితి నెలకొన్నదన్నారు. పదేండ్లలో రాష్ట్రంలో అత్యధికంగా వరి సాగుచేసి రికార్డు సృష్టించిన తెలంగాణ నేడు కరువు కోరల్లో చిక్కుకున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ గొప్పలు చెప్పడం తప్పా తెలంగాణకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. రామమందిరమని కొత్త రాగం ఎత్తుకొని ప్రజలను మభ్యపెడుతున్నదన్నారు. బీఆర్‌ఎస్‌ను గెలిపించి అభివృద్ధికి సహకారం అందించాలని ప్రజలను కోరారు. మోసపూరిత హామీలిచ్చి ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు.



రాజాపూర్‌లో సన్నాహక సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు

మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

# మళ్లా మోసపోవద్దు

- కాంగ్రెస్ పాలనలో తెలంగాణ విధ్వంసం
- నాలుగు నెలల్లోనే కరువు తెచ్చిండ్రు
- ఆరు గ్యారెంటీలంటూ నిలువునా మోసం
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

రాజాపూర్, ఏప్రిల్ 20 : పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీఆర్‌ఎస్ ఎంపీలను గెలిపించుకొని విధ్వంసానికి గురవుతున్న తెలంగాణ అభివృద్ధిని కాపాడుకుందామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం రాజాపూర్‌లోని జేకే ప్యాలెస్‌లో ఉమ్మడి బాలానగర్, రాజాపూర్ మండలాల బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఉద్యమ నేత కేసీఆర్ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా కొట్లాడి సాధించుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో పదేండ్లలో అభివృద్ధి చేశారన్నారు. నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావని, ప్రజలు కూడా వీరిపై విసిగిపోయారన్నారు. ఏ పల్లెకు పోయినా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి తప్పు చేశామన్న భావన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు కేసీఆర్ హయాంలో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ కాంగ్రెస్ చేతగానితనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో తెలిపించాలని కోరారు.

***రైతుల పక్షపాతి కేసీఆర్..***

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణను అన్నపూర్ణగా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించారని గుర్తుచేశారు. పదేండ్ల పాలనలో ఏ గ్రామానికి వెళ్లినా రోడ్లు, మార్కెట్లో ధాన్యపు రాసులు కనిపించేవన్నారు. నేడు కాంగ్రెస్ పాలనలో కరువు స్పష్టంగా కనబడుతుందన్నారు. పంటలు ఎండిపోయి రైతులు అరిగోస పడుతున్నరన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను మరిచి పాలన చేతకాక కేసీఆర్, కేటీఆర్‌లపై విమర్శలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని మండిపడ్డారు. రెండు నదులు చెంతనే పారుతున్నా ప్రజలకు నీళ్లు ఇవ్వలేని జాతీయ పార్టీలు మనకు అవసరమా అని ప్రజలు ఆలోచించాలన్నారు. మిషన్ కాకతీయతో చెరువులను పునరుద్ధరించారని, మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో తాగేందుకూ మంచి నీళ్లు లేక బిందెలతో రోడ్లపైకి వచ్చే పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు.

***ఆరు గ్యారెంటీలు బోగస్..***

కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు బోగస్ అని తేటతెల్లమైందని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలను మరోసారి ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. కేసీఆర్ హయాంలో చేసిన మంచి పనులను ప్రజల గుండెల్లో నిలుపుకొన్నారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి మన్నెను గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సుశీల, జెడ్పీటీసీ మోహన్‌నాయక్, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీశైలంయాదవ్, శ్రీనివాస్‌రావు, మాజీ ఎంపీపీ నర్సింహులు, బచ్చిరెడ్డి, అభిమన్యురెడ్డి, చెన్నారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆల

## మన్నెను గెలిపించుకుందాం..

నారాయణపేట, ఏప్రిల్ 20 : పాలమూరు బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం కోయిలకొండ మండలం శేరివెంకటాపూర్‌లో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన సన్నాహక సమావేశానికి నారాయణపేట బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి భారీ మెజార్టీ సాధించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో వైఫల్యాలను వివరించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త రవీందర్‌రెడ్డి, మండలాల అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

## మోసకారి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

నర్వ, ఏప్రిల్ 20 : మోసకారి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన నర్వలో జరిగిన సన్నాహక సమావేశానికి రాజేందర్‌రెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కొట్లాడి సాధించిన రాష్ట్రాన్ని పదేండ్ల పాలనలో కేసీఆర్ సుభిక్షం చేశారని, దేశ చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. దేశంలో రైతులకు గౌరవం దక్కిందంటే కేవలం కేసీఆర్ పాలనలోనే అన్నారు. నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ తన అసమర్థతను నిరూపించిందని, ప్రజలు మరోసారి ఆ పార్టీని నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. మన్నెను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

***అసమర్థ పాలనలో పాలమూరు ఎడారి..***

పదేండ్లు పచ్చని పంటలతో కళకళలాడిన పాలమూరు కాంగ్రెస్ పాలనలో ఎడారిగా మారిందని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలతో మక్తల్ నియోజకవర్గం ఎడారిగా మారుతుందన్నారు. స్థానికుడైన మన్నె శ్రీనివాస్‌రెడ్డి కేసీఆర్ సహకారంతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తుచేశారు. మరోసారి ఆదరిస్తే మరింత అభివృద్ధి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు ఆసిరెడ్డి, మక్తల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహులు గౌడ్, ఎంపీపీ జయరాములుశెట్టి, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మహేశ్వర్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేందర్‌రెడ్డి, చిట్టెం

# కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి

- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కోస్గి, ఏప్రిల్ 20 : బూటకపు హామీలతో తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రజలను నిలువునా మోసం చేసిందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని స్టోర్స్ అథారిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ శాసం రామకృష్ణలతో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే కరువు, మోసమన్నారు. నీళ్ల లేక పంటలు ఎండి రైతులు అష్టకష్టాలు పడుతుంటే కనీసం నష్టాన్ని అంచనా వేయడానికి కూడా ప్రభుత్వానికి పట్టింపు లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అలివి కాని హామీలిచ్చి ఒక్క హామీ తప్పా మిగతావన్నీ బోగస్ అన్నారు. మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ప్రజలంతా ఆలోచించి ఓటు వేయాలని కోరారు. పాలమూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు జనార్దన్‌రెడ్డి, బందెప్ప, వైస్ ఎంపీపీ సాయిలు, బీఆర్‌ఎస్ నాయకులు నిరంజన్‌రెడ్డి, మోహన్‌గౌడ్, చైతన్యగౌడ్, వెంకట్‌నర్సింహులు, బుగ్గప్ప, వెంకట్రాములు, రుద్రప్ప, కృష్ణ, రాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్నం నరేందర్‌రెడ్డి

# మూడో రోజు రెండు నామినేషన్లు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మూడో రోజు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలకు ఇద్దరు అభ్యర్థులు శనివారం నామినేషన్లు దాఖలు చేశారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా రాకేశ్, ఎంఐఎం అభ్యర్థిగా షేక్ మున్నాబాషా నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవినాయక్‌కు అందజేశారు. కాగా, నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌కు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

ఆదివారం సెలవు కావడంతో నామినేషన్లు వేసేందుకు అవకాశం లేదు.

# ఉద్యోగ, ఉపాధి కల్పనే ధ్యేయం

- అధికారం కోసం ఆశపడే వ్యక్తిని కాదు..
- అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతా
- బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్




వనపర్తిలో ప్రజలతో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

వనపర్తి టౌన్, ఏప్రిల్ 20 : ఉద్యోగ, ఉపాధి కల్పనే ధ్యేయంగా పనిచేస్తానని బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం ఉదయం వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో మార్నింగ్ వాక్‌లో భాగంగా బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అభిలాష్‌రావుతో కలిసి వాకర్స్‌తో మాట్లాడారు. ఎకో పార్కు, పశువుల సంతలో ప్రజలతో మాట్లాడి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అధికారం కోసం ఆశపడి ఉంటే అధికార పార్టీలో చేరేవాడినని, తెలంగాణ మూలాలు కలిగిన ఉద్యమ పార్టీలో చేరి ప్రజలకు మేలు చేయాలనుకున్నట్లు తెలిపారు. కొట్లాడి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌కు మనమంతా పార్లమెంట్ స్థానాన్ని గెలిపించి ఇద్దామన్నారు. వనపర్తి ప్రాంతంతో తనకు ప్రత్యేకమని, పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్నోసార్లు వాకింగ్ చేశానన్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి నిధులు తీసుకొచ్చి కాలేజీ రూపురేఖలు మార్చారని, నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఉద్యోగ, ఉపాధి కల్పనే ధ్యేయంగా పాటుపడతానని, ప్రజలంతా బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలపాలని కోరారు. విద్యావంతులు, మేధావులు, యువకులు, మహిళలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, నందిమల్ల అశోక్, బండారి కృష్ణ, రహీం, శ్రీను, జాత్రూనాయక్, శ్రీను తదితరులు ఉన్నారు.

***వాల్మీకులకు అండగా ఉంటా..***

వనపర్తి, ఏప్రిల్ 20 : వాల్మీకుల రిజ్వరేషన్ సాధన కోసం తనవంతుగా కృషి చేస్తానని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ సర్కారులో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని చెల్లప్ప కమీషన్ వేసిందని, రెండు పర్యాయాలు అసెంబ్లీలో తీర్మానం చేసి పంపితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. న్యాయమైన డిమాండ్ కోసం ప్రశ్నించే గొంతుకనవుతానని, అండగా ఉంటానన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. వాల్మీకుల రిజ్వరేషన్ కోసం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు వేణుగోపాల్, నీలస్వామి, రవికుమార్, తిరుమల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన బీఎస్పీ నేతలతో మాజీ ఎమ్మెల్యే బీరం, ప్రవీణ్‌కుమార్

## ఆర్‌ఎస్‌పీని గెలిపిద్దాం.. : బీరం

కొల్లాపూర్, ఏప్రిల్ 20 : పేదల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ఎల్లప్పుడూ పాటుపడుతుందని, ఆర్‌ఎస్‌పీని పార్లమెంట్‌కు పంపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీఎస్పీ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి కాటం విష్ణుతేజ, నాయకుడు చిన్నదర్గాస్వామి ఆ పార్టీకి రాజీనామా చేసి శనివారం కొల్లాపూర్‌లో గులాబీ గూటికి చేరారు. వీరికి బీరంతోపాటు బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, సోషల్ మీడియా పార్లమెంట్ ఇన్‌చార్జి రంగినేని అభిలాశ్‌రావు గులాబీ కండువాకప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీరం మాట్లాడుతూ నిజాయితీ, నిస్వార్థ సేవకుడైన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఆదరించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.